Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 267 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :267 | బుధవారం 24 సెప్టెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4




## 11 రాష్ట్రాలు విపరీత అప్పులు

- 28 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు రెవెన్యూ మిగులు
- 12 రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు
- మిగులు ఆదాయంలో యూపీ టాప్
- రెవెన్యూ మిగులు రాష్ట్రాల్లో తెలంగాణ..
- రెవెన్యూ లోటు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్

# సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం



- 'ప్రైవేటు'లో 90 శాతం సిజేరియన్లే.. ఇది సరికాదు
- తమ ప్రభుత్వం ఇలాంటి ధోరణిని ఏమాత్రం ఆమోదించబోదని
- గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలి
- యోగా నేర్పించే పరిస్థితి రావాలి
- "ఎప్పుడైనా సరే ఆపరేషన్.. ఆపరేషనే
- భగవంతుడు ఇచ్చిన సహజసిద్ధమైన శరీరాన్ని కోయడం మంచిది కాదు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో 90 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని.. తమ ప్రభుత్వం ఇలాంటి ధోరణిని ఏమాత్రం ఆమోదించబోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలని, యోగా నేర్పించే పరిస్థితి రావాలని.. దీనిపై ఇప్పట్నుంచే శ్రద్ధ పెట్టాలని, పిలిచి మాట్లాడాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు సూచించారు. వైద్యారోగ్యశాఖపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ఈమేరకు మాట్లాడారు. "ఎప్పుడైనా సరే ఆపరేషన్.. ఆపరేషనే. భగవంతుడు ఇచ్చిన సహజసిద్ధమైన శరీరాన్ని కోయడం మంచిది కాదు. సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం.. ఇది సరికాదు. ఇలాంటివి ఎలా నియంత్రించాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగితే.. అందులో 42 శాతం ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్నాయి" అన్నారు. "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలనేది మనందరి ఆకాంక్ష. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారు. 2047 నాటికి చైనా జనాభా వంద కోట్లే ఉంటుంది. అప్పటికి భారత్‌లో 162 కోట్లు అవుతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా క్రమంగా తగ్గుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ - మిగతా3లో




## జీఎస్టీ సంస్కరణలు.. వేడుకల తొలిరోజు 80వేల కార్ల విక్రయాలు

- ఆటో మొబైల్ రంగానికి భారీగా ఊతమిచ్చాయి.
- నవరాత్రి వేడుకల ప్రారంభంతో దేశంలోని అన్ని కార్ల షోరూమ్‌లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి
- వినియోగదారుల రద్దీ పెరగడంతో పలు కంపెనీలు సోమవారం రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపాయి.
- కేంద్రం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా చిన్న కార్లు, ఎస్‌యూవీలపై 28 నుంచి 18శాతానికి జీఎస్టీ తగ్గించిన విషయం తెలిసిందే.



## వైసీపీ హయాంలో రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

### గతంలో విద్యారంగంపై చర్చ సందర్భంగా వైసీపీ వాకౌట్ చేసిన పరిస్థితి

### మండలిలో మంత్రి నారా లోకేష్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి.. ఇప్పుడు ఏవిధంగా మాట్లాడతారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై మంగళవారం శాసన మండలిలో వైసీపీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టగా ఛైర్మన్ తిరస్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. బీఏసీలో ఈ అంశంపై - మిగతా3లో

## విలవిలలాడుతున్న రూపాయి

- భారత రూపాయి మారకం విలువ సరికొత్త రికార్డు కనిష్ఠానికి
- ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మరో 18 పైసలు బలహీనపడి, మునుపెన్నడూ లేని విధంగా 88.50 వద్ద ముగిసింది.
- మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది






## కాంగ్రెస్ ఎంపీ 'నెపోకిడ్' పోస్ట్

- రాహుల్ గాంధీ గురించేనంటూ భాజపా సెటైర్లు
- "2023లో శ్రీలంక, 2024లో బంగ్లాదేశ్, 2025లో నేపాల్‌లో ప్రభుత్వాలు కూలిపోయాయి



## త్వరలో వందే భారత్ స్లీపర్..!

- రైల్వే మంత్రి క్లారిటీ
- ప్రస్తుతం ఒక రైలు ఢిల్లీలో సిద్ధంగా ఉంది
- మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుంది

# మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.5,500 కోట్లు

- భవిష్యత్ అవసరాల కోసం 14 ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ట్రాన్స్ కో చేపట్టే వివిధ పనులతో నెట్ వర్క్ ఓవర్ లోడ్ తగ్గడంతో పాటు లో ఓల్టేజ్ సమస్యలను తగ్గించడానికి అవకాశం
- రాష్ట్రంలో 6 నుంచి 8 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుంది
- పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాల కోసం 14 ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాలను చేపడుతున్నాం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గృహ, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల భవిష్యత్ డిమాండ్ తీర్చడానికి ట్రాన్స్ కో పరిధిలోని 68 ప్రాంతాల్లో రూ.5,500 కోట్లతో వివిధ అభివద్ధి పనులు చేపట్టామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లకు సంబంధించి ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర యాదవ్, పేరాబత్తుల రాజశేఖర్, బీటీ నాయుడులు అడిగిన ప్రశ్నకు మంగళవారం నాడు శాసన మండలిలో మంత్రి గొట్టిపాటి సమధానం చెప్పారు. ట్రాన్స్ కో చేపట్టే వివిధ పనులతో నెట్ వర్క్ ఓవర్ లోడ్ తగ్గడంతో పాటు లో ఓల్టేజ్ సమస్యలను తగ్గించడానికి అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 6 నుంచి 8 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాల కోసం 14 ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాలను చేపడుతున్నామని స్పష్టం చేశారు. పనులన్నీ పూర్తయితే లో ఓల్టేజ్ సమస్య కూడా తగ్గుతుందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 400 కేవీ సబ్ స్టేషన్లు 18, 220 కేవీ సబ్ స్టేషన్లు 113తో పాటు 132 కేవీ సబ్ స్టేషన్లు 244 ఉన్నాయని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న - మిగతా3లో



## మార్కాపురంలో 625 పడకలతో పీపీపీ విధానంలో వైద్య కళాశాల

- గిరిజన ప్రాంతాల్లో 90 శాతం వైద్యుల పోస్టుల భర్తీ
- శాసనసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి అధిక ప్రాధాన్యత నిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో - మిగతా3లో

## కోర్టులేమైనా డబ్బు రికవరీ ఏజెంట్లా?

- సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణిపై అసహనం
- డబ్బు రికవరీ వంటి సివిల్ వివాదంలో అరెస్ట్‌ను ఒక సాధనంగా ఉపయోగించకూడదు
- క్రిమినల్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోన్న ట్రెండ్‌ను ఇది ప్రతిబింబిస్తోంది



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
శ్రీకాళహస్తి మంగళవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వగ్రామం ఊరందూరులో ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును తొట్టంబేడు మండలం లింగమ నాయుడు పల్లె గ్రామానికి చెందిన కె.శివకుమార్ కుటుంబసభ్యులకు రూ 4,76,000 విలువగల చెక్కును స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన
## ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాలు
### భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టండి
### తాసిల్దార్ లోకనాథం పిళ్ళై



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 23:**
అంగరంగ వైభవంగా ఆరిమాని గంగమ్మ తల్లి దసరా సవరన్న రాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి ఎస్ఆర్ పురం మండలంలోని తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి ఆలయంలో దసరా ఉత్సవాలను ఆలయ అర్చకులు వెంకటపతి ఆచార్యులు అమ్మవారి పుట్ట మట్టిని మేళ తాళాల నడుమ ఊరేగించి అంకురార్పణ చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొల్పి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి వివిధ పుష్పాలతో సుందరంగా శైలపుత్ర అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా యాగశాలలో అమ్మవారి చిత్రపటాన్ని 108 కళాశాలను ఏర్పాటు చేసి హోమా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిని జోష్ణ గారిచే హరికథ నిర్వహించారు రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులతో దర్శించుకున్నారు. దసరా ఉత్సవాలను ఎస్ఆర్ పురం తాసిల్దార్ లోకనాథం పిళ్ళై, ఎస్ఐ సుమన్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఆలయ ఈవోను ఆలయ చైర్మన్‌ను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట రాయల్, ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఉభయదారుడు పైనేని మురళి,ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు జలంధర్ నాయుడు, హిమాచలపతి రెడ్డి, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్ర నాయుడు, అడ్వకేట్ రమేష్ రెడ్డి, సిద్దయ్య శెట్టి, వెంకటరామయ్య, జనసేన పార్టీ చందు మండల యువత అధ్యక్షుడు చంద్రబాబు రెడ్డి, తయ్యూరు పాయకట్టు ప్రజలు పాల్గొన్నారు. అమ్మవారి ఊరేగింపుకు ఉభయ దారులుగా మంగుంట గ్రామస్తులు వ్యవహరించారు.

## విశేషాలంకారంలో విరుపాక్షమ్మ అమ్మవారు



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
పులిచెర్లమండలం కల్లూరు శ్రీవిరుపాక్షమ్మ ఆలయంలో మంగళవారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ విరూపాక్ష అమ్మ వారు కోరిన కోరికలు తీర్చేకొలువై ఉన్న విరూపాక్ష అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మంజునాథ దీక్షితులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉభయదారులుగా ఆరఒగం పాపయ్యశెట్టి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## రేణిగుంటలో ఇసుక మాఫియాపై
## రెవెన్యూ అధికారుల దాడి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
రేణిగుంటమండలం పిల్లపాలెం గ్రామంలో ఇసుక మాఫియాపై రెవెన్యూ అధికారులు దాడి చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది. అక్రమంగా సాగుతున్న ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఈ దాడిలో అధికారులు ఒక జేసీబీతో పాటు నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసారు. అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాజాగా ఇసుక రవాణా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరు పాల్పడినా వదలబోమని తహసీల్దార్ స్పష్టం చేశారు.

## కుంకుమాలంకారంలో శ్రీకాశీ విశాలాక్షమ్మ అమ్మవారు



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శరన్నవ రాత్రి రెండవ రోజు ఉత్సవాల్లో భాగంగా కాశీ విశాలాక్షి మా అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారిని సుగందాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారు భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కొలువయ్యారు.

# బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో బోయకొండ గంగంగమ్మ
## పట్టు వస్త్రాలు సమర్పించిన చల్లా రామచంద్రారెడ్డి దంపతులు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
ప్రముఖపుణ్యక్షేత్రమైన శ్రీశక్తి స్వరూపిణి కల్పవల్లి లోకమాత, శ్రీబోయకొండ గంగమ్మ దేవస్థానంలో దసరామహోత్సవములకు మంగళవారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి చల్లా రామ చంద్ర రెడ్డి, దంపతులు వారి కుటుంభ సభ్యులతో విచ్చేసి అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించినారు. ఈ కార్య క్రమములో తెలుగుదేశం పార్టీ మండలా ధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి బోయకొండ సుబ్బు ఆధ్వర్యంలో నాయకులు బోయ కొండ ఆర్చ్ వద్ద గజమాలతో స్వాగతం పలికారు. దేవస్థాన కార్యనిర్వహణాధి కారి ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చల్లా రామచంద్రారెడ్డి దంపతులకు బాల త్రిపుర సుందరీ దేవిగా కొలువుతీరిన బోయకొండ గంగమ్మ దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం యాగశా లలో వేద ఆశీర్వాదం తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి రామచంద్రారెడ్డి మాట్లాడు తూ మొదటగా ఈ రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రాష్ట్రం లోనే ఇటువంటి శక్తి క్షేత్రమైన శ్రీబోయ కొండగంగమ్మను ప్రజలందరూ దర్శించి ఈ రాష్ట్రం మంచి పరిపాలనలో ఇంకా పదికాలాలు కొనసాగాలంటే నారా చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొన సాగాలని ఈ రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం కావాలని ఈ బోయకొండ గంగమ్మ ఆశీర్వాదం పుంగనూరు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకు న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో,మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి,నాయకులు లక్ష్మీపతి రాజు,బోయకొండ సుబ్బు,పూల చంద్రమౌ



ళి,కుమార్ రెడ్డి,అనూష్ రాయల్ రెడ్డి, సోమశేఖర్,అర్జున్ రాయల్,ముని,పవన్, దేవస్థాన అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పసుపు అలంకారంలో త్రిపుర సుందర దేవి

**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**



పులిచెర్లమండలం జాంద్రపేట శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవినవ రాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, కలసస్థాపన, అమ్మవారికి అభిషేకము పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకము పూజలు జరిపినైవేద్యం సమర్పించిమహా మంగళహారతి గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమంలో నిర్వహించారు. ఉభయదారులు వగ ళ్లవారిపల్లెకు చెందిన వి.మధుసూదన్ రెడ్డి, కుటుంబసభ్యులు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రతిరోజు రాత్రి 7 గంటలకు కుంకుమార్చన జరుపబడును. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగలరని కోరారు.

## అన్నపూర్ణ దేవి అలంకారంలో
## శ్రీ గౌరీ దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి



**కల్లూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 23:**
పులిచెర్లమండలం కల్లూరులో వెలసిన శ్రీప్రసన్న గౌరీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అన్న పూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మ వారిని విశేషంగా అలంకరించి అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రరావు పూజా కార్యక్రమంలో వహించారు. ఉభయదారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాల్లో వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ప్రకృతి సాగు రైతుకు కలెక్టర్ ఘన సన్మానం



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
సదుంమండలం దేవదారు మాగులపల్లె గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి నాగరాజు గల 7 ఎకరాల మామిడి తోటలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట చేసి మంచి గిట్టుబాటు ధరకు అమ్ముకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రైతు నాగరాజును ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, మార్కెటింగ్ ఫైజునిషా, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుంకుమాలంకారంలో శ్రీకాశీ విశాలాక్షమ్మ అమ్మవారు

**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**

పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శరన్నవ రాత్రి రెండవ రోజు ఉత్సవాల్లో భాగంగా కాశీ విశాలాక్షి మా అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మ వారిని సుగందాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారు భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కొలువయ్యారు.



## దసరా వేడుకల్లో రెండవరోజు
## కామాక్షీ దేవిగా భక్తులకు దర్శనం.



**వికోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23 :**
చిత్తూరు జిల్లా వికోట పట్టణం దుర్గానగర్‌లో వెలసిన శ్రీదుర్గామాత దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవరోజు అమ్మవారు కామాక్షీ దేవిగా భక్త కోటిని అలరించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరశర్మ బృందం ఆధ్వర్యంలో వేద మంత్రిచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం నాడు అమ్మవారి సేవలో స్థానిక తహశీల్దార్ ఉదయ్ సంతోష్ తోపాటుగా మండలంలోని మొత్తంరెవిన్యూ సిబ్బంది, పాల్గొన్నారు. సాయంత్రం దుర్గాంబ వారి కమ్యూనిటీ భవనంలో కామాక్షీ దేవి ఊంజల్ సేవలో ఉభయదారు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్చకులు కామాక్షీ దేవి అవతార విశిష్టతను ప్రతి ఒక్కరూ చేయాల్సిన కర్తవ్యాలను గురించి వివరించారు. అనంతరం అన్నప్రసాద వియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డా.ఎస్ఆర్ దామోదర్‌రెడ్డి, కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కోశాధికారి తుకారామ్, ఆలయ కమిటీ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో
## శ్రీ సత్యమ్మ తల్లి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
అన్నమయ్యజిల్లా గండబోయినపల్లి గ్రామదేవత శ్రీసత్యమ్మతల్లి ఆలయంలో నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీగాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీసత్యమ్మతల్లి శ్రీగాయత్రీదేవి అలంకరణల అభిషేకాలు కుంకుమార్చన ప్రత్యేకపూజలు కార్యక్రమానికి ఉభయదారులుగా బీదావాండ్లపల్లి గ్రామ ప్రజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయకమిటీ సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి, సద్దల చక్రపాణి, ఏ ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమేష్, సత్యనారాయ ణరెడ్డి, హరి, చంద్రశేఖర్, చిన్నపరెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, ఆలయ పూజారి ఉత్తన్న స్వామి కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
## స్వస్తి నారి స్వసక్తి పరివార్ అభియాన్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**



ఎన్ .కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్వస్తినారి స్వసక్తిపరివార్ అభియాన్ కార్యక్ర మాన్ని డాక్టర్ సుభాష్‌రాజా, డాక్టర్ సుధారాణి, సర్పంచ్ కె రాజశేఖర్, ఎంపీటీసీ రామచంద్రప్ప, టీడీపీ ప్రజా ప్రతినిధిలు చేతుల మీదగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో ఎన్. కొత్తపల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి గర్భవతులు బాలింత తల్లులు వృద్ధులు మరియు మిగతా వారు కూడా వచ్చి ఆసుపత్రిలో లభించే వైద్య పరీక్షలను, స్త్రీలకి కాన్సర్ పరీక్షలు, మరియు గర్భవతులకు, రక్తపరీక్షలు, గర్భపరీక్షలు చేయంచుకున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమనికి గాను ఏరియా హాస్పిటల్ కుప్పం చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ, పిఇఎస్ మెడికల్ కాలేజ్ నుండి స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ కృషిత గైనకాలజిస్ట్, డాక్టర్ ఉదయలక్ష్మి, డాక్టర్ సుప్రీత్ జనరల్ మెడిసిన్, చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ జ్యోషిత, ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి కాను విచ్చేసి ప్రజలను పరీక్షించి అవసరమైనటువంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసర మైనటువంటి మందులును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సుభాష్ రాజా గర్భవతుల గురించి మాట్లాడుతూ గర్భం ధరించినప్పటి నుంచి డెలివరీ పోస్ట్ డెలివరీ సందర్భాలలో సమతుల్య ఆహారం మరియు ఐరన్ కలిగిన ఆహారాన్ని తప్పకుండా తినాలని ఆరోగ్యవంతమైన తల్లులు ఆరోగ్యవంతమైన పిల్లలను ఈ సమాజానికి అందించాలని గర్భం ధరించినప్పటి నుంచి డెలివరీ వరకు ప్రభుత్వం వారు అందించే పలు సేవలను పీఎంఎంవివై జె ఎస్ వై వంటి ప్రభుత్వ పథకాలను గూర్చి ప్రతి గర్భవతికి వివరించారు వైద్య సిబ్బంది. ఉన్నది ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడం కోసమే కావున వారి సర్వీసెస్‌ని తగిన విధంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. స్వస్తి నారి - స్వశక్తి పరివార్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళ ఆరోగ్యవంతంగా ఉండాలని దానికి అవసరమైన చర్యలకు ప్రభుత్వం వారు అందించే ప్రతి సర్వీసును వినియోగించుకోవాలని ప్రతి గృహిణి ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు ఆరోగ్యంగా ఉంటుందని ఆ గృహిణి ఆరోగ్యంగా చూసుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# ఎమ్మెల్యేలపై చర్యలు...



**అమరావతి :** అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీ? 11మంది ఎమ్మెల్యేలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ పార్టీకి టెక్నికల్‌గా ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే? సభలో నాలుగు పార్టీలు ఉండగా? మూడు కూటమి మిత్రపక్షాలే. ఇక మిగిలి ఉంది మేమే కాబట్టి? మాకు ఆ హోదా కావాలన్నది వైసీపీ డిమాండ్. ప్రధాన ప్రతిపక్ష హోదా ఎలాపడితే అలా ఇచ్చేసేదికాదని, సభా నియమాల ప్రకారం నడుచుకుంటూ అందుకు తగ్గట్టు జనం ఇచ్చిన తీర్పును బట్టే ఇచ్చేదన్నది ప్రభుత్వ వాదన. ఈ విషయంలో వైసీపీ కోర్ట్‌కు వెళ్ళినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు. తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉండదు కాబట్టి మేం? అసెంబ్లీకి రాబోమంటూ? పట్టుదలగా ఉన్నారు మాజీ సీఎం జగన్. ఈ పరిస్థితుల్లో? వైసీపీ ఎమ్మెల్యేలకు కొత్త భయం పెరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే ప్రతీసారి వైసీపీ వాళ్లు సభకు రావాలి.. రాకుంటే చర్యలు తప్పవని అంటున్నారు స్పీకర్, డిప్యూటీ స్పీకర్. బడ్జెట్ సెషన్‌లో వైసీపీ సభ్యులు మమ అనిపించినా? టెక్నికల్‌గా అవి కౌంట్‌లోకి రాలేదు. దీంతో వరుసగా 60 రోజులు సభకు హాజరుకాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవచ్చని తాజాగా హాట్ కామెంట్స్ చేశారు ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు.ప్రస్తుతం సెషన్ నడుస్తున్న క్రమంలో? సభకు హాజరవకుంటే? అనర్హత వేటు వేస్తామని, మీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా హెచ్చరించారు. ఇదే ఇప్పుడు పొలిటికల్ హాట్ అయ్యింది. తమ ఎమ్మెల్యేలపై చర్యల అంశంలో గతంలోనే స్పందించారు వైపీసీ అధ్యక్షుడు జగన్. వాళ్లకు బుద్ధి పుట్టినట్టు చర్యలు తీసుకోమనండి? ఎవరు కాదన్నారంటూ రియాక్ట్ అయ్యారాయన. తాజాగా వైసీపీ ఎల్పీ సమావేశంలో కూడా ఇదే అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్ళు ఈ అంశాన్ని జగన్ ముందు ప్రస్తావించటంతో ఆయన కూడా గతంలో స్పందించిన తరహాలోనే చర్యలు తీసుకోనివ్వండి.. చూద్దాం అన్నట్టు తెలిసింది. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించటానికే కదా? మనం సమయం అడుగుతోంది. టెక్నికల్ రీజన్స్‌తో ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా కనీసం నిర్దిష్ట సమయం ఇస్తామని కూడా క్లారిటీగా చెప్పడం లేదు? 40 శాతం ఓట్లు వచ్చిన మనల్ని సాధారణ సభ్యులుగా పరిగణించి రెండు, మూడు నిమిషాల సమయం ఇస్తే సరిపోదు కదా.. అని జగన్ అన్నట్టు చెప్పుకుంటున్నారు. అదే సమయంలో? సభకు వెళ్ళని సభ్యుల మీద ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం కూడా సాధ్యం కాదనేది వైసీపీ వర్షన్. చర్యలు తీసుకోబోయే ముందు స్పీకర్ వైసీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలి. ఆ నోటీసులకు వాళ్ళు సమాధానం చెప్పాలి. ఆ సమాధానాలకు సంతృప్తి చెందక పోతేనే.. స్పీకర్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అయితే ఈ విషయంలో ఇప్పటికే వైసీపీ కోర్ట్‌కు వెళ్లి ఉండటం, స్పీకర్ యాక్షన్ తీసుకున్నా తిరిగి కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండటం లాంటి కారణాలతో సాగదీత ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేతప్ప ఇప్పటికిప్పుడు యాక్షన్ తీసుకునే అవకాశం ఉండకపోవచ్చన్నది విశ్లేషకుల మాట. దీంతో ఒకరిద్దరు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మినహా మిగతా వారిలో దాని గురించి అంత టెన్షన్ లేనట్టు తెలుస్తోంది. ఒకవేళ సీరియస్ యాక్షన్ తీసుకున్నా? దానికి విరుగుడు మందును పార్టీ అధినేత జగన్ ఎలాగూ సిద్దం చేస్తారు కాబట్టి కంగారేం లేదన్నది సీనియర్ ఎమ్మెల్యేల అభిప్రాయం అట. సభకు హాజరవలేదని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్న దాఖలాలు దేశంలో ఎక్కడా లేవని గుర్తు చేస్తున్నారు పొలిటికల్ పండిట్స్. రాజకీయ సవాళ్ళకు, చట్టపరంగా తీసుకునే చర్యలకు చాలా తేడా ఉంటుందని భావిస్తున్నారు. అయితే? ఇవన్నీ తెలియకుండానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ కామెంట్స్ చేస్తారా అన్నది ఇంకో క్వశ్చన్. దీంతో గవర్నమెంట్ యాక్షన్, అందుకు వైసీపీ రియాక్షన్ ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

# అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు...
# జగన్‌తో విబేధిస్తున్న ఆ ఆరుగురు



**విశాఖపట్టణం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్ బై చెబుతారా? తమంతట తాము బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారా? లేకుంటే అధికార పార్టీ ప్రలోభ పెడుతోందా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం తాజాగా ఒక ప్రకటన చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్ళిపోయే అవకాశం లేదని తేల్చి చెప్పారు. చివరి వరకు తమ కుటుంబం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగుతుందని.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులమని చెప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే ఉన్నపలంగా వైసీపీ ఎమ్మెల్యే ఇప్పుడు పార్టీ మారడం లేదని చెప్పడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు టిడిపిలో చేరడం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏడాది పాటు ఎదురుచూసిన వారు ఇప్పుడు చేరుతుండడం ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో బిజెపిలోకి ఒక ఎమ్మెల్సీ వెళ్లడం కూడా చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చుట్టూ ఏదో జరుగుతోందన్న అనుమానం బలపడుతోంది.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో ఐదుగురు పార్టీలో సీనియర్లు. ఆపై జగన్మోహన్ రెడ్డి సొంత సామాజిక వర్గానికి చెందినవారు. మిగతా వారు మాత్రం కొత్తవారే. కూటమి ప్రభంజనాన్ని సైతం తట్టుకొని నిలబడ్డారు. అయితే వారు అసెంబ్లీకి వెళ్లి అధ్యక్షా అనాలని ఎక్కువ మందికి ఆలోచన ఉంటుంది. ఎందుకంటే ఎమ్మెల్యేగా గెలిచి సభలో అడుగుపెట్టడం అనేది ప్రతి ఒక్కరి కల. కానీ జగన్మోహన్ రెడ్డి రాజకీయ కోణంలో ఆలోచించి సభకు గైర్హాజరవుతున్నారు. అయితే వైసీపీకి తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. అందులో ఎక్కువ మంది జగన్ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. దీంతో వారంతా అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.ఏపీలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 18న ప్రారంభం అయ్యాయి. అదే రోజు జగన్ పార్టీ ఎమ్మెల్యేలు తో సమావేశం అయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని తేల్చి చెప్పారు. సభకు హాజరైన మాట్లాడే అవకాశం ఇవ్వనందున.. మనం సభకు వెళ్లడం వృథా ప్రయాస అని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు బాహటంగానే వ్యాఖ్యానాలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. సభకు వెళితే బాగుంటుందన్న అభిప్రాయం వినిపించింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారధ్యంలో మీరు సభకు వెళ్ళొచ్చని జగన్ ఎమ్మెల్యేలతో అన్నట్లు కూడా టాక్ నడిచింది. కానీ అందుకు పెద్దిరెడ్డి విముఖత చూపడంతో అక్కడితో ఆ చర్చ ఆగిపోయింది. జగన్ తిరిగి బెంగళూరు వెళ్ళిపోయారు.ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పాడేరు వైద్య కళాశాల విషయంలో కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు ఆందోళన చేపట్టారు. అయితే పక్కనే ఉన్న అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం మాత్రం హాజరు కాలేదు. ఆపై సీఎం చంద్రబాబు సమక్షంలో వైసీపీ ఎమ్మెల్సీలు టిడిపిలో చేరారు. దీంతో రాజకీయంగా కూటమి సరికొత్త ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డిని విభేదించి ఓ ఐదు, ఆరుగురు ఎమ్మెల్యేలు సభకు హాజరైతే ఇబ్బందుల్లో పెట్టవచ్చన్న ఆలోచనలో కూటమి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖంగా అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం పేరు వినిపిస్తోంది. ఆయనతో పాటు ఓ ఐదుగురిని సభకు రప్పించి.. ప్రజాక్షేత్రంలో జగన్మోహన్ రెడ్డిని పలుచన చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## వైసీపీ హయాంలో రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు

-మొదటిపేజీ తరువాయి

చర్చకు ఎందుకు లేవనెత్తలేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వం దిగేనాటికి రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టారు. కోవిడ్ సమయంలో రూ.644 కోట్లు ఎగ్గొట్టారు. ఆర్టీఎఫ్ కింద 3వేల కోట్లు పెండింగ్ లో పెట్టారు. ఎంటీఎఫ్ కింద 895 కోట్లు పెండింగ్ లో పెట్టారు. 2024%-%25 ఏడాదికి వచ్చేసరికి కూటమి ప్రభుత్వంలో రూ.1,200 కోట్లు విడుదల చేశాం. పెండింగ్ లో ఉన్న రూ.1,400 కోట్లు వచ్చే మూడు నెలల్లో విడుదల చేస్తాం. వైసీపీ హయాంలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టి ఇప్పుడు ఏవిధంగా మాట్లాడతారని కౌంటర్ ఇచ్చారు. దీనిపై వైసీపీ మండలి పక్షనేత బొత్స చర్చకు పట్టుబట్టగా.. బీఏసీలో ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదని మంత్రి ఎండగట్టారు. కనీసం ఈ అంశాన్ని అడగలేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై చర్చకు సిద్ధమని, సభను వైసీపీ సభ్యులు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. తమ డొల్లతనం బయటపడుతుందనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల అంశాన్ని బీఏసీలో లేవనెత్తలేదని చెప్పారు. విద్యారంగంపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. గతంలో విద్యారంగంపై చర్చ సందర్భంగా బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. దీనిపై చర్చకు సిద్ధం. సరైన ఫార్మాట్ లో రావాలని సూచించారు.

## సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం

-మొదటిపేజీ తరువాయి

తగ్గిపోతోంది. యూపీ, బిహార్ వల్లే భారత్‌లో జనాభా బ్యాలెన్స్ అవుతోంది. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య.. జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉంది. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మన వద్ద ఎక్కువే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.15 లక్షల మంది వైద్యులు ఉన్నారు. మన దేశంలో సగటు జీవిత కాలం 70 ఏళ్లుగా ఉంది. ఇమ్యునైజేషన్ 97 శాతం సాధించాం. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించాం. త్వరలోనే వంద శాతం సాధిస్తాం. గర్భిణుల్లో అనీమియా 32 శాతంగా ఉంది" అని వివరించారు.

**ప్రజారోగ్యంపైనా రాజకీయాలే!**

ప్రజల ఆరోగ్యం విషయంలో కొందరు రాజకీయాలు చేయడంపై మండిపడ్డారు. కొందరు ఏమీ తెలియకుండానే మాట్లాడుతూ రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారన్నారు. "ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజ్ ఉండాలని చెప్పింది నేనే. ప్రస్తుతం రాష్ట్రంలో 38 వైద్య కళాశాలలు ఉన్నాయి. వైకాపా హయాంలో 17 వైద్య కళాశాలలకు రూ.1550 కోట్లు ఇచ్చారు. సాలూరులో ట్రైబల్ వర్సిటీ పూర్తి చేసే బాధ్యతను మేం తీసుకున్నాం. వైకాపా చేసినట్లు మేం కూడా చేస్తే మరో 15 ఏళ్లు పడుతుంది. వైద్య కళాశాలల విషయంలో పీపీపీ విధానంలో ముందుకెళ్తున్నాం. మేంవచ్చాక కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. పీపీపీ అంటే తెలుసుకోవాలి. ఆర్థిక సంస్కరణల్లో భాగం. అనేక రంగాల్లో పీపీపీలు వస్తున్నాయి. సంపద సృష్టి జరిగింది. ఈ విధానం కింద పెట్టుబడిదారులు వస్తున్నారు" అని తెలిపారు.

## మార్కాపురంలో 625 పడకలతో పీపీపీ విధానంలో వైద్య కళాశాల

-మొదటిపేజీ తరువాయి

మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడారు. 'ఉద్యోగ, స్వచ్ఛంద ఉద్యోగ విరమణలవల్ల వైద్యుల కొరత ఏర్పడుతుండగా వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజారోగ్యమే లక్ష్యంగా వాక్%-%ఇన్%-%ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తున్నాం. పదోన్నతులు కూడా చేబడుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన అనంతరం గిరిజన ప్రాంతాల్లోని 153 పీహెచ్సీలకు కలిపి 306 సివిల్ అసిస్టెంటు సర్జన్ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో ఖాళీగా ఉన్న 138కు 131 పోస్టుల (90%)ను గత 5 నెలల్లో భర్తీ చేశాం. ప్రస్తుతం 31 పోస్టులు (10%) ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి కూడా చర్యలు తీసుకుంటున్నాం. ప్రకాశం జిల్లా మార్కాపురం జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చేందుకు గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో గందరగోళం నెలకొన్నందున వైద్యులు, మౌలిక సదుపాయాలకు కొరత ఏర్పడింది. నిర్మాణాలకు రూ.47 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టింది. 625 పడకలతో మార్కాపురం వైద్య కళాశాలను పీపీపీ విధానంలో నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్ సర్వీస్ కోటా పీజీ చేసేందుకు వెళ్లిన సుమారు 250 మంది వైద్యులు నవంబరులో రానున్నారు. వీరిని అవసరమైన ఆసుపత్రుల్లో నియమిస్తాం. కనిగిరి, కోవూరు, బచ్చిరెడ్డిపాలెంలోని ఆసుపత్రుల అభివద్ధికి చర్యలు తీసుకుంటాం. గుండెపోటుతో బాధపడే వారికి స్పెషలిస్టు వైద్యుల ద్వారా స్టెమీ విధానంలో రూ.45వేలు విలువచేసే ఉచిత ఇంజెక్షన్ చికిత్స అందిస్తున్నాం. స్టెమీ విధానంలో సుమారు 4వేల మంది రోగులు ప్రాణాపాయ పరిస్థితుల నుంచి కోలుకున్నారు. పీహెచ్సీ స్థాయిలో స్టెమీ విధానం అమలుకు స్పెషలిస్టు వైద్యుల అవసరముంది. పీహెచ్సీల్లో వీరు లేనందున అక్కడ స్టెమీ సౌకర్యాన్ని అందుబాటులోనికి తీసుకురావడం కష్టమవుతుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలవల్ల మాతత్వ మరణాలు 38.8% నుంచి 30%కు తగ్గాయి' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

## మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.5,500 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

చర్యలతో రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ అందుకోగలుగుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, ఇండస్ట్రియల్ పాలసీలతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఎంఓయులు చేసుకుంటున్నాయన్నారు. పరిశ్రమల విద్యుత్ వినియోగానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఐటీ, పరిశ్రమలు, విద్యుత్ శాఖ సంయుక్త కార్యాచరణతో పని చేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్ అవసరాల కోసం అవసరమైన చోట సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. 63 ప్రాంతాల్లో 33 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నం వంటి పట్టణాలలో వర్షాలు పడేప్పుడు, ఇతర సమయాల్లోనూ విద్యుత్ అంతరాయాల సమస్యలను పరిష్కరించడానికి స్కాడా సెంటర్ ను ఏర్పాటు చేశామని మంత్రి గొట్టిపాటి గౌరవ సభ్యులకు వివరించారు. స్కాడా సెంటర్ వేదికగా విశాఖ నగర పరిధిలోని సుమారు 110 సబ్ స్టేషన్ పనితీరు పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. స్కాడా సెంటర్ వేదికగా ఎక్కడ సమస్య ఉందో వెంటనే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ సమస్య అయినా ప్రభుత్వం దష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి కషి చేస్తామని మంత్రి గొట్టిపాటి శాసనమండలి సాక్షిగా గౌరవ సభ్యులకు హామీ ఇచ్చారు.

# క్రాస్ క్లోవర్ లీఫ్ కోసం 127 ఎకరాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో బందరు పోర్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది! దీనికి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారులను విస్తరించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా నేషనల్ హైవే 65, నేషనల్ హైవేలను కలుపుతూ ఒక ప్రత్యేక కూడలిని నిర్మించనున్నారు. దీనివల్ల పోర్టుకు సరుకులు చేరవేయడం సులభమవుతుంది అంటున్నారు. అంతేకాదు, తెలంగాణ నుంచి కూడా రవాణా మరింత సులువు కానుంది. ఈ ప్రాజెక్టుతో ప్రాంతీయ అభివృద్ధికి బాటలు పడనున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో మరో హైవే విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే బందరు పోర్టు త్వరలో అందుబాటులోకి రానుండటంతో.. ఆ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. అలాగే బందరు పోర్టుకు వెళ్లే రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. నేషనల్ హైవే-65, నేషనల్ హైవే-216 లను పోర్టుకు అనుసంధానం చేస్తారు. దీని కోసం 127 ఎకరాల భూమిని సేకరించనున్నారు.. భూసేకరణపై చర్చించేందుకు జిల్లా మోర్త్ అధికారులు ఢిల్లీ వెళ్లారు.మచిలీపట్నం దగ్గర నేషనల్ హైవే 65, నేషనల్ హైవే-216 రోడ్లు కలిసే చోట ఒక కూడలిని నిర్మించనున్నారు. దీని వల్ల పోర్టుకు వెళ్ళే వాహనాలకు ట్రాఫిక్ సమస్య ఉండదు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. ఈ కూడలి (క్రాస్ క్లోవర్ లీఫ్) త్వరగా పూర్తయితే అభివృద్ధికి మరింత ఉపయోగపడుతుంది. మచిలీపట్నం బైపాస్ వంతెన దగ్గర ఈ కూడలిని నాలుగు రింగులతో నిర్మిస్తారు. దీని వల్ల పోర్టుకు వచ్చే వాహనాలు నేరుగా వెళ్ళిపోవచ్చు. ఇతర వాహనాలతో కలిసే అవకాశం ఉండదు. దీని వలన ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. పోర్టు పూర్తయితే ఓడల రాకపోకలు పెరుగుతాయి.. ఈ సమయంలో కూడలి అందుబాటులోకి వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.ఈ కూడలి (జంక్షన్) నిర్మాణం కోసం మూడు గ్రామాల పరిధిలో భూమిని సేకరించనున్నారు. మొత్తం 127 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఎస్ఎన్‌గొల్లపాలెంలో 94 ఎకరాలు, అరిసేపల్లిలో 27 ఎకరాలు, మాచవరంలో 5 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఈ మేరకు సర్వే నంబర్లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వాటిని మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్)కు పంపించారు. భూసేకరణ కోసం 3ఏ నోటిఫికేషన్‌ను మరో 15 రోజుల్లో ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.నేషనల్ హైవే 216 ను విస్తరిస్తే తెలంగాణకు బందరు పోర్టుతో సంబంధం ఏర్పడుతుంది. దీనివల్ల భద్రాచలం, ఖమ్మం నుండి గ్రానైట్ రాయిని పోర్టుకు ఈజీగా పంపవచ్చు. అమరావతి గాఖీఖీ దగ్గర నుంచే ఈ రహదారి వెళ్తుంది కాబట్టి రాజధానికి వెళ్లడం సులువు అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు కూడా ఉండవు. నూజివీడు మామిడి పండ్లు, మల్లవల్లి పరిశ్రమల ఉత్పత్తులను తేలికగా రవాణా చేయవచ్చు. ఇది తీర ప్రాంత రహదారి. దీనివల్ల ఆక్వా ఉత్పత్తులను పోర్టుకు ఎగుమతి, దిగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. మొత్తం మీద బందరు పోర్ట్ నిర్మాణంతో హైవే విస్తరణతో పాటుగా అమరావతికి, హైదరాబాద్‌కు కనెక్టివిటీ మరింత పెరుగుతుంది అంటున్నారు. ఈ పనుల్ని త్వరలోనే ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు అధికారులు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143



## ఏరియా ప్రభుత్వ హాస్పిటల్‌లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని ఏరియా ప్రభుత్వ హాస్పిటల్‌లో మంగళవారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడా డైరెక్టర్ రాజకుమార్, కుప్పం జనసేన పార్టీ అధ్యక్షుడు నరేష్,పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మహిళలలు ఆరోగ్య పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు.ప్రతీ ఒక మహిళలు ఆరోగ్య కారణాలు స్క్రీనింగ్ ద్వారా చూపించుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో టాటా హెల్త్ కేర్ సెంటర్ ద్వారా ప్రజలకు అవగా హన కల్పిస్తూ, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం అనారోగ్యంగా ఉన్న కొంతమందికి న్యూట్రిషన్ ఫుడ్ ను ఇవ్వడం జరిగింది.

## నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణం కి భూమి పూజలు చేసిన రాష్ట్రతెలుగు యువత నాయకులు చెక్కునత్తం మణి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
కుప్పం మండలం మోట్లచెను పంచాయతీ నారుమానుకొతాలు హరిజనవాడలో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణంకి భూమి పూజలు చేసిన మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కడ కమిటీ సభ్యులు రామచంద్ర, రాష్ట్ర తెలుగు యువత నాయకులు చెక్కునత్తం మణి, రాజారామ్ బాబు, కనకరాజు, విభూషణ్, మనోహర్, తిరుపతి, సుబ్రమణి, ఎత్తిరాజులు, హైదర్ భాష, ప్రకాష్, సంతానం,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కుప్పం ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
కుప్పం ప్రజల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష సెంటర్‌ను కుప్పం ప్రాంతంలో ప్రారంభించినందుకు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, నటసింహం, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకి మంగళవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి కుప్పం నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలపడం జరిగింది. కుప్పం నియోజకవర్గ ప్రజల కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు.

## బాలికలకు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 23:**
స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పెనుమూరు జూనియర్ కాలేజీలో ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కౌమారదశలో ఉన్న బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, పోషక ఆహారానికి సంబంధించిన విషయాలు తెలిపారు. డాక్టర్‌లు రుతుక్రమసమయంలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరం, ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన పోషకాహార ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరణాత్మకంగా మాట్లాడారు. బాలికలుతమ సందేహాను వ్యక్తపరచడంతో పాటు, అవగాహనతో కూడిన చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం బాలికల్లో ఆరోగ్యంపై సానుకూల దృక్పథాన్ని ఏర్పరచడం ద్వారా భవిష్యత్‌లో శక్తివంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ బాబు, హెడ్ నర్స్ నిర్మలదేవి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 23:**




స్వస్థనారి స్వసక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అందించే వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్‌పురం వైద్యాధికారిని సమమా రెహమాన్ తెలిపారు. మంగళవారం నెలవాయి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సర్పంచ్ జయలక్ష్మి కుమార్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సుమారు 250 మంది రోగులు పాల్గొని చికిత్స తీసుకున్నారు. ఈ శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో పర్యవేక్షిక సిబ్బంది గంగాదేవి, శ్రీనివాసులు రెడ్డి, తిరుమలయ్య, సిబ్బంది వైష్ణవి కోటే శ్వరి పూజిత లోకేశ్వరి, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

## విప్పమాని పట్టడలో మెగా ఉచిత వైద్య శిబిరం



**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,సెప్టెంబర్ 23 :**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కింద విప్పమాని పట్టడ గ్రామ పంచాయతీ పరిధిలోని వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంకు చెందిన డాక్టర్ చక్రపాణి,డాక్టర్ తేజస్విని, సిహెచ్ఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొని రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ స్క్రీనింగ్, తల్లి-బిడ్డ ఆరోగ్య పరీక్షలు, వయోవృద్ధులు, కిషోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ వైద్యంపై ప్రత్యేక సేవలు అందించారు. అదనంగా గ్రామస్తులకు ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి మాట్లాడుతూ, “ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. వైద్య బృందం చేసిన కృషి అభినందనీయం” అన్నారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది గ్రామ ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి మండల పీహెచ్సీ వైద్యులు, సూపర్వైజర్ కామరాజు, ఎంఎన్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు యమునా, మోహిని మరియు ఇతర సిబ్బంది సహకరించారు.

## ఆరిమాని గంగమ్మ ను దర్శించుకున్న
### టిడిపి యువ నాయకుడు పైనేని మురళి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
ఎస్ఆర్ పురంమండలం తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీఆరిమాని గంగమ్మ తల్లి దసరానవరాత్రి ఉత్సవాల సందర్భంగా టిడిపి యువ నాయకుడు ఎమ్ కే మొబైల్స్ అధినేత, అమ్మవారు ఉత్సవాల కరపత్రాల దాత పైనేని మురళి మంగళవారం దర్శించుకున్నారు. ఆయన కు ఆలయ ఈవో వెంకట రాయల్ పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మ వారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదలను అందజేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీ ఇరగాలమ్మ నవరాత్రి ఉత్సవాలు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
అంగరంగ వైభవంగా శ్రీఇరగాలమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నా మని ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం మూలూరు గ్రామంలో వెలసిన శ్రీ ఇరగాలమ్మ ఆలయంలో నవరాత్రిఉత్సవాల్లోభాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకం ప్రత్యేకహోమం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించమని ఆలయచైర్మన్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## పారిశుద్ధ్య పనులను చేపట్టాలి
### సర్పంచ్ హబీబ్ భాష



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23**
అన్నమయ్యజిల్లా పీలేరు పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సర్పంచ్ హబీబ్ భాషా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం, దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం చర్యలను ముమ్మరంగా చేపట్టాలని ఎక్కడ మురికి నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అలాగే క్రమం తప్పకుండా త్రాగనీరు సరఫరా చేయాలని ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా పారిశుద్ధ చర్యలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పారిశుద్ధ్య సానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్ పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## రేణిగుంటలో ఉచిత దంత వైద్య శిబిరం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23 :**
రేణిగుంట సాయి దంత వైద్యశాల బృందం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు శివ సాయి ప్రసాద్ రెడ్డి, సాయి ప్రవీణ్, సమీరా, సారా గమ్య ఈ కార్యక్రమంలో సేవలు అందించారు. సీతాఫల్ సంస్థ సి.ఈ.ఓ.శశి కుమార్ దుగ్గసాని సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సంస్థ ఉద్యోగులకు దంత ఆరోగ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఉద్యోగికి దంత పరీక్షలు చేసి, తగిన చికిత్స సూచనలు ఇచ్చారు. అదనంగా అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

## ఘనంగా పోషణ మాస ఉత్సవాలు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
శ్రీకాళహస్తి ఎర్రగుడిపాడు అంగనవాడి కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రగతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఘనంగా పోషణ మాస ఉత్సవాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ శాంతి దుర్గ సూచనలు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులు బాలింతలు మహిళలు ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచుకోవాలని చౌకగా లభించే ఆకుకూరలు కాయగూరలు పండ్లు పెరటి తోటల్లో లభించే తోటకూర బీర చిక్కుడు గోంగూర అరటి బొప్పాయి వంటి ఆకుకూరలు పండ్లు తప్పక తీసుకోవాలని రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు . పెరటి తోటల పెంపకం పై ప్రతి మహిళ పెద్ద వహించాలని కోరారు అంగన్వాడీ కేంద్రం టీచర్ లీలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అటుకులు బెల్లం ఖర్జూరం పాలు గుడ్లు బాలామృతం క్రమం తప్పక తీసుకోవాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రియదర్శిని వెల్ఫేర్ అసిస్టెంట్ చందన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని గ్రామంలో బాల్యవాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు రాజీ, గర్భిణీ స్త్రీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## జీయస్టీ స్థానిక ఉత్పత్తి రంగానికి ఊతం
### రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**
శ్రీకాళహస్తి వికసిత్ భారత్-2047 సాధనే లక్ష్యంగా ఆత్మనిర్భర్ భారత్‌కు బాటలు వేస్తూ స్థానిక ఉత్పత్తి రంగానికి జీయస్టీ సంస్కరణలు ఊతమిస్తాయని తెలుగు దేశంపార్టీ, బిసి విభాగం రాష్ట్రకార్యనిర్వా హక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు ఆశాభావంవ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ డబుల్ బెనిఫిట్ ఇస్తూ, జియస్టీ 4 శ్లాబుల నుంచి 2 శ్లాబులకు పరిమితం చేయబడిందని, దీని వలన రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సుమారు రూ.15,000/-ఆదా అవుతుందని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.కులమ తాలకు అతీతంగా ప్రతీ ఒక్క వర్గానికి జీఎస్టీ పండుగ వచ్చిందని, 375 రకాల వస్తువులపై ధరలు తగ్గింపుతో జీఎస్టీ పన్ను సంస్కరణలు అమలులోకి రావడం భారతదేశ ఆర్థిక వ్యవస్థ సాధించిన గొప్ప విజయం అని కొనియాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కలిగిస్తూ, రోజువారీ అవసరాల నుంచి గృహోపయోగ వస్తువులు వరకు ప్రతీదీ అతితక్కువ ధరలలో సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్లు,బైకులు , ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలలో భారీ తగ్గింపు రావడం పేద,మధ్యతరగతి కుటుంబాలకు కాస్త ఊరటనిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం , అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సరళీకృత జీఎస్టీ పేద, మధ్య తరగతి ప్రజల జీవనానికి సౌలభ్యం
### పేదల ప్రాణవాయువుగా మారిన సరళీకృత జీఎస్టీ

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 23:**



శ్రీకాళహస్తి భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆదేశాలుతో రాష్ట్ర ఉపాధ్య క్షులు కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణం నందు స్థానిక బెరివారి మండపం వద్ద నుంచి నాలుగు మాడా వీధుల్లో భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, వర్తకులుతో కలసి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగినది. గాలిగోపురం దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపు తూ వారి చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగినది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజల జీవన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సరళీకృతం కేంద్ర ప్రభుత్వం చేయడం జరిగినది. నిత్యావసర వస్తువులు, పేదలకు, విద్యార్థులకు ఉపయోగ పడే వస్తువులుపై 0%, 5%గా, 18% పాపం వస్తువులు, లగ్జరీ వస్తువులు పైన 40% స్లాబ్‌లుగా సంస్కరణలు చేయడం జరిగిందని కోలా ఆనంద్ తెలిపారు. దీంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడం వల్ల మార్కెట్ పుంజుకుని దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంతమవుతుందని చెప్పారు. ఈ సంస్కరణలు ప్రజలకు ప్రాణవాయువు లాంటివని, స్వదేశీ వస్తువులు తయారీకి ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల తో దేశ ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేస్తాయని కోలా ఆనంద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ప్రోగ్రామ్ కన్వీనర్ బీడీ బాలాజీ, రాష్ట్ర సభ్యులు కంద్రిగ ఉమ, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, వేదం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143